# గోపాల్ నగర్ గ్రామపంచాయతీకి ఎనిమిది సీసీ కెమెరాల విరాళం



**ఉద్యమ కెరటం, తాండూర్:** తాండూర్ మండలం గోపాల్ నగర్ గ్రామపంచాయతీకి హరికృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎనిమిది సీసీ కెమెరాలను విరాళంగా అందజేశారు. కంబాల గాయత్రి జన్మదినాన్ని పురస్కరించుకుని ట్రస్ట్ సభ్యులు శనివారం ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ భద్రతను మరింత పటిష్టం చేయాలనే ఉద్దేశంతో సుమారు రూ.50వేల విలువైన సీసీ కెమెరాలను గ్రామపంచాయతీకి అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు ట్రస్ట్ సభ్యుల సేవా కార్యక్రమాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో హరికృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కంబాల నర్సయ్య, గ్రామ సర్పంచ్ గాట్ల నర్సయ్య, ఉప సర్పంచ్ గాజుల సునీత రామ్మోహన్, వార్డు సభ్యులు కంబాల బాలయ్య, కంబాల తిరుపతి, గాజుల రమేష్, కంబాల శంకర్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# బాధితులను పరామర్శించిన రాథోడ్ రమేష్



**ఉద్యమ కెరటం, జైనూర్:** మండలంలోని అడ్డేసర గ్రామంలో గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలు, ఈదురుగాలుల కారణంగా నష్టపోయిన కుటుంబాలను జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా చైర్మన్ రాథోడ్ రమేష్ శనివారం పరామర్శించారు. గ్రామంలో పలువురు ప్రజల ఇళ్లు దెబ్బతినడంతో పాటు గూళ్లు చెదిరిపోవడం, ఇళ్ల పైకప్పులు కొట్టుకుపోవడం వంటి ఘటనలను పరిశీలించి బాధిత కుటుంబాలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వర్షాల కారణంగా నష్టపోయిన కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని గుర్తించి వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించారు. జైనూర్ తహశీల్దార్, డిప్యూటీ తహశీల్దార్లతో ఫోన్లో మాట్లాడి బాధితులకు ప్రభుత్వం తరఫున తక్షణ సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రకృతి విపత్తులతో నష్టపోయిన ప్రజలను ఆదుకోవడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం, గృహ మరమ్మతులకు అవసరమైన సాయం అందించాలని అధికారులను విజ్ఞప్తి చేశారు. బాధిత కుటుంబాలు ధైర్యంగా ఉండాలని, వారి సమస్యల పరిష్కారం కోసం తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు.

# మంత్రి జూపల్లి కృష్ణారావుకు ఘన స్వాగతం



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** ఆదిలాబాద్ జిల్లా పర్యటన నిమిత్తం శనివారం జిల్లాకు వచ్చిన రాష్ట్ర ఎక్సైజ్, ప్రొహిబిషన్ శాఖ మంత్రి, జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావుకు నేరడిగొండ మండలంలోని రోల్మామడ టోల్ప్లాజా వద్ద నాయకులు ఘన స్వాగతం పలికారు. కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆడే గజేందర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మంత్రిని పూలమాలలు, శాలువాతో సత్కరించి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలుపై మంత్రితో చర్చించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని మంత్రి జూపల్లి కృష్ణారావుకు ఘన స్వాగతం పలికారు.

# వేంసూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా కాసర చంద్రశేఖర్ రెడ్డి

**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** సత్తుపల్లి నియోజకవర్గంలోని వేంసూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా కాసర చంద్రశేఖర్ రెడ్డిని నియమించారు. ఈ మేరకు శనివారం సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ఆధ్వర్యంలో ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఖమ్మం జిల్లా డీసీసీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ హాజరయ్యారు. నూతన బాధ్యతలు స్వీకరించిన కాసర చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి పార్టీ బాధ్యతలు అప్పగించిన కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానానికి, ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్కు కృతజ్ఞతలు తెలిపారు. వేంసూర్ మండలంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలతో కలిసి సమష్టిగా కృషి చేస్తానని పేర్కొన్నారు. పార్టీ సిద్ధా ంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, గ్రామస్థాయిలో పార్టీని మరింత పటిష్టం చేయడమే తన లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి, వేంసూర్, పెనుబల్లి, కల్లూరు, తల్లాడ మండలాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, సర్పంచ్లు, ఉప సర్పంచ్లు, వార్డు సభ్యులు, కౌన్సిలర్లు, మహిళా నాయకులు, డీసీసీ నాయకులు, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్యూఐ ప్రతినిధులు, గ్రామ కాంగ్రెస్ నాయకులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# రక్త దానం - ప్రాణదానం..

## నేడు జూన్ 14 తేదీ ప్రపంచ రక్తదాతల దినోత్సవం






**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** మానవతా విలువలన్నింటిలోనూ రక్తదానం అత్యంత ఉత్కృష్ట మైనదిగా నిలుస్తుంది. ఒకరి ప్రాణాన్ని కాపాడేందుకు మరొకరు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తాన్ని అందించే ప్రక్రియను గౌరవిస్తూ, ప్రతి ఏటా జూన్ 14వ తేదీన ప్రపంచవ్యాప్తంగా రక్తదాతల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తారు. ఆధునిక వైద్యశాస్త్రంలో రక్తాన్ని గ్రూపులుగా విభజించి, సురక్షిత రక్తమార్పిడి విధానాన్ని ప్రపంచానికి పరిచయం చేసిన నోబెల్ బహుమతి గ్రహీత కార్ల్ ల్యాండ్‌స్టీనర్ జయంతిని పురస్కరించుకుని ఈ రోజును కేటాయించారు. సమాజంలో రక్తదానం పట్ల ఉన్న అపోహలను తొలగించి, యువతలో చైతన్యం తీసుకురావడమే ఈ దినోత్సవం యొక్క ముఖ్య ఉద్దేశం.ప్రస్తుత కాలంలో రోడ్డు ప్రమాదాలు, అత్యవసర శస్త్రచికిత్సలు, ప్రసవ సమయాల్లో రక్తస్రావం కావడం వంటి సందర్భాల్లో రక్తం అందుబాటులో లేక ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారు. అలాగే తలసేమియా, క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే రోగులకు క్రమం తప్పకుండా రక్తం అందించడం ఎంతో అవసరం. ఫ్యాక్టరీలలో తయారు చేయలేని, కేవలం మానవ శరీరం మాత్రమే ఉత్పత్తి చేయగల ఈ అమూల్యమైన ద్రవాన్ని దానం చేయడం ద్వారా ఒక వ్యక్తి ఒకేసారి నలుగురి ప్రాణాలను కాపాడే అవకాశం లభిస్తుంది. 18 సంవత్సరాల నుండి 65 సంవత్సరాల వయస్సు ఉండి, కనీసం 45 కిలోల బరువున్న ఆరోగ్యవంతమైన ప్రతి ఒక్కరూ ప్రతి మూడు నెలలకోసారి నిర్భయంగా రక్తదానం చేయవచ్చు.

### రక్తదానంతో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు

రక్తదానం చేయడం వల్ల కేవలం తీసుకునే వారికే కాకుండా, ఇచ్చే దాతలకు కూడా ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు చేకూరుతాయని వైద్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు. క్రమం తప్పకుండా రక్తదానం చేయడం వల్ల శరీరంలో కొత్త రక్తం ఉత్పత్తి అయ్యి, రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధుల బారిన పడే అవకాశాలు గణనీయంగా తగ్గుతాయి. రక్తదానానికి ముందు నిర్వహించే ప్రాథమిక ఆరోగ్య పరీక్షల ద్వారా దాతల ఆరోగ్యం కూడా ఎప్పటికప్పుడు మెరుగుపడుతుంది. 'రక్తాన్ని దానం చేయండి, ప్రాణాలను నిలపండి' అనే నినాదంతో ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు వచ్చినప్పుడే ఆరోగ్యవంతమైన, ప్రాణభయం లేని సమాజ నిర్మాణం సాధ్యమవుతుంది.

### రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలి

ప్రశాంత్ , సామాజిక కార్యకర్త అత్యవసర సమయాల్లో రక్త దానం యొక్క ఆవశ్యకత ప్రతి ఒక్కరు తెలుసుకుంటే ప్రపంచంలో రక్తహీనత మరణాల రేటు తగ్గుతుంది. ఇప్పటివరకు నేను రక్తదానం చేస్తూ అవసరం అవసరం ఉన్నప్పుడల్లా రక్త దాతలను ప్రోత్సహించి ఇప్పటివరకు నేను 10వ సారి రక్తదానం చేశాను. రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణీ స్త్రీలు మరియు అనీమియా తల సేమియా వ్యాధిగ్రస్తులకు అవసరమగు బ్లడ్ గ్రూపుల తదితల సేకరించి ఇప్పటివరకు 3వేల యూనిట్లు సేకరించడం జరిగింది.ఈ సంవత్సరం జనవరి నెల కామారెడ్డి లో IVF ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాతీయ రక్తదాత పురస్కారం మన కొమరం భీం జిల్లా నుండి అందుకోవడం జరిగింది. యువత రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలి.

# ఇండియన్ ఆర్మీకి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల ఎంపిక





**ఉద్యమ కెరటం, కాగజ్‌నగర్:** కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్న మాండోరే శంకర్ (బీఏ), గౌత్రే కళ్యాణ్ (బీకాం), కొమినవేని సతీష్ (బీఎస్సీ)లు ఇండియన్ ఆర్మీలో అగ్నివీర్‌లుగా ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీదేవి, కెరీర్ గైడెన్స్ సెల్ ఇంచార్జ్ డాక్టర్ లక్ష్మీనరసింహం తెలిపారు. గత సంవత్సరం నిర్వహించిన ఇండియన్ ఆర్మీ అగ్నివీర్ నియామక ప్రక్రియలో పాల్గొన్న ఈ విద్యార్థులు రాత పరీక్షతో పాటు శారీరక దారుఢ్య పరీక్షల్లోనూ ప్రతిభ కనబర్చి ఇటీవల నియామక ఉత్తర్వులు అందుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు, సిబ్బంది ఎంపికైన విద్యార్థులను అభినందించారు. విద్యార్థులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలపై నిరంతరం అవగాహన కల్పించడంతో పాటు ప్రత్యేక శిక్షణ అందిస్తున్నామని ప్రిన్సిపాల్ తెలిపారు. కెరీర్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యంలో వివిధ ఉద్యోగ నోటిఫికేషన్లపై ఎప్పటికప్పుడు మార్గదర్శకత్వం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే సోమవారం నుంచి కళాశాలలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ (ఎఫ్‌బీఓ), పోలీస్ ఉద్యోగాల కోసం ఉచిత శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాల కోసం **సెల్:**7013607011 పై సంప్రదించవచ్చని తెలిపారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియలో కాంగ్రెస్ బీఎల్ఏలు అప్రమత్తంగా ఉండాలి

### డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఎస్ఐఆర్ తో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ తీరుతో విపక్ష పార్టీ లఓట్లు ప్రమాదంలో పడ్డాయని, భారీగా ఓట్ల చోరీ జరుగుతోందని డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ నరేష్ జాదవ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని కంది శ్రీనివాస్ రెడ్డి క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆదిలాబాద్ నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన బీఎల్ఏ-2 శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా టీపీసీసీ ట్రైనర్ నరేష్ రాథోడ్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియను అడ్డుపెట్టు కుని బీజేపీ వ్యతిరేక ఓట్ల తొలగింపునకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఓటర్ల జాబితాలో ప్రతి ఓటును మ్యాపింగ్ చేసుకుని కాపాడుకోవడం అత్యంత అవసరమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి బీఎల్ఏ-2ల పాత్ర కీలకమని పేర్కొన్నారు. అనంతరం డాక్టర్ నరేష్ జాదవ్ మాట్లాడుతూ ఆదిలాబాద్ నియోజకవర్గంలో ఇంకా 91వేల ఓట్లు మ్యాపింగ్ కాలేదని, అందులో 42వేల ఓట్లు ప్రశ్నార్థకంగా ఉన్నాయని తెలిపారు. ఒక్క ఓటు కూడా కోల్పోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా మైనార్టీ లు, మహిళల ఓట్ల విషయంలో ప్రత్యేక శ్రద్ధ అవసరమన్నారు. ప్రతి పది బూత్‌లకు ఒక సూపర్‌వైజర్‌ను నియమించి ఎస్ఐఆర్ ప్రక్రియను పర్యవేక్షిస్తామని తెలిపారు. అనంతరం కోఆర్డినేటర్లు భారీ స్క్రీన్ ద్వారా ఎస్ఐఆర్‌పై అవగాహన కల్పిస్తూ శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో కంది సాయిమౌన రెడ్డి, బాలూరి గోవర్ధన్ రెడ్డి, బోరంచు శ్రీకాంత్ రెడ్డి, గిమ్మ సంతోష్, అల్లూరి సంజీవ రెడ్డి, సాజిద్ ఖాన్, ఖీజర్ పాషా, పరమేశ్వర్, శాంతన్ రావు, సుధాకర్ గౌడ్, దీపక్ రావు, బొల్లారం బాబన్న, కొండ గంగాధర్, నాయకులు, బీఎల్ఏలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బీఎల్ఏ-2లు కాంగ్రెస్ పార్టీకి వెన్నెముక

- కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జిఆడే గజేందర్
- బోథ్‌లో ఎస్ ఐఆర్ అవగాహన సదస్సు





**ఉద్యమ కెరటం, ఇచ్చోడ:** బీఎల్ఏ-2లు కాంగ్రెస్ పార్టీకి వెన్నెముక లాంటి వారని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జిఆడే గజేందర్ అన్నారు. శనివారం ఇచ్చోడ మండల కేంద్రంలోని గంగారెడ్డి గార్డె న్‌లో టీపీసీసీ ఆధ్వర్యంలో ఎస్ఐఆర్ పై బూత్ లెవల్ ఏజెంట్లకు (బీఎల్ఏ-2) ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హులైన ప్రతిఒక్కరిని ఓటర్ల జాబితాలో చేర్చే బాధ్యత కాంగ్రెస్ శ్రేణులపై ఉందన్నారు. బోథ్ నియోజకవర్గంలోని ప్రతి బూత్‌లో పనిచేస్తున్న బీఎల్ఏ-2లు బాధ్యతాయుతంగా వ్యవహరించి, 18 సంవత్సరాలు నిండిన యువతను ఓటర్లుగా నమోదు చేయించడంలో చొరవ చూపాలని సూచించారు. ఓటర్ల జాబితాలోని తప్పులను సవరించడం, మరణించిన, వలస వెళ్లిన వారి పేర్ల తొలగింపు ప్రక్రియలపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ నరేష్ జాదవ్ మాట్లాడుతూ బూత్ స్థాయిలో పార్టీ బలోపేతానికి బీఎల్ఏల పాత్ర కీలకమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తూనే, ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలోనూ చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ముఖ్య అతిథిగా హాజరైన టీపీసీసీ రాష్ట్ర ట్రైనర్ రాథోడ్ నరేశ డిజిటల్ ప్రొజెక్టర్ ద్వారా బీఎల్ఏ-2లకు శిక్షణ అందించారు. ఫారమ్-6 ద్వారా కొత్త ఓటర్ల నమోదు, ఫారమ్-7 ద్వారా తొలగింపులు, ఫారమ్-8 ద్వారా సవరణలు చేపట్టే విధానాన్ని వివరించారు. బీఎల్ఓలతో సమన్వయం, ఆన్‌లైన్ నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కోఆర్డినేటర్లు మోహన్ కుమార్, రాఘవేంద్ర రెడ్డి, ఆదిలాబాద్ ఎస్ఐఆర్ కోఆర్డినేటర్ పసుల చంటి, మార్కెట్ కమిటీ చైర్మన్లు సత్యనారాయణ, సత్యవతి కోటేశ్, ఆత్మ చైర్మన్లు గొర్ల రాజు యాదవ్, కౌడల నారాయణ, జిల్లా నాయకులు, వివిధ మండలాల అధ్యక్షులు, అనుబంధ విభాగాల ప్రతినిధులు, బీఎల్ఏ-2లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గిరిజన సంక్షేమ గెజిటెడ్ హెడ్‌మాస్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక

- రాష్ట్ర అధ్యక్షుడిగా రాథోడ్ ప్రకాష్, ప్రధాన కార్యదర్శిగా సారయ్య

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ గెజిటెడ్ హెడ్‌మాస్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర సర్వసభ్య సమావేశం, రాష్ట్ర శాఖ ఎన్నికలు ఉట్నూర్ కేంద్రంలోని పీఎంఆర్సి భవనంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ఖమ్మం ఉమ్మడి జిల్లా, వరంగల్ ఉమ్మడి జిల్లా ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలకు చెందిన గిరిజన సంక్షేమ శాఖ గెజిటెడ్ హెడ్‌మాస్టర్లు పెద్ద సంఖ్యలో హాజరై సమావేశాన్ని, ఎన్నికలను విజయవంతం చేశారు. ఈ ఎన్నికలలో గెజిటెడ్ హెడ్‌మాస్టర్ రాష్ట్ర అధ్యక్షులుగా రాథోడ్ ప్రకాష్ , రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సారయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే రాష్ట్ర కార్యవర్గంలో అధ్యక్షులుగా లింగాల శ్రీరాములు , వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బద్రు , అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఉద్ధవ్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. సంఘం బలోపేతానికి దిశానిర్దేశం చేసేందుకు రాష్ట్ర చీఫ్ అడ్వైజర్లుగా అశోక్ కుమార్ , శ్రీచందన్ , అత్రం భాస్కర్ , డి. సుధాకర్ , సనత్ కుమార్ శాస్త్రి లు నియమితులయ్యారు. ఎన్నిక అనంతరం నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ సంఘ బలోపేతం, గిరిజన సంక్షేమ విద్యాభివృద్ధి, ఉపాధ్యాయులు మరియు గెజిటెడ్ హెడ్‌మాస్టర్ల సంక్షేమం కోసం అందరం



సమిష్టిగా కృషి చేయాలని సంకల్పించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన రాష్ట్ర అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మరియు చీఫ్ అడ్వైజర్ల ం దరికీ పలువురు హృదయపూర్వక అభినం దనలు శుభాకాంక్షలు తెలియజేశారు. రాబోయే రోజుల్లో వీరి నాయకత్వంలో సంఘం మరింత అభివృద్ధి చెందాలని, గిరిజన విద్యారంగానికి విశిష్ట సేవలు అందించాలని ఆకాంక్షించారు.

# అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తాం

- రిమ్మ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతాం
- రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు
- ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభం
- గ్రంథాలయానికి రూ.10 లక్షల మంజూరు



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఆదివాసీల ఆచార సాంప్రదాయాలు దేశానికి ఆదర్శమని, ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ఎక్సైజ్, ప్రొహిబిషన్ శాఖ మంత్రి, జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శనివారం సిరికొండ మండలం రిమ్మ గ్రామంలో పర్యటించిన మంత్రి నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ గృహాలను ప్రారంభించి లబ్ధిదారులతో మాట్లాడారు. లబ్ధిదారులు నైతం కవిత–సోము, తొడసం సుదర్శన్–మధుబాయి, సీతాబాయి–దేవురావు కుటుంబాలకు చెందిన నూతన గృహాలను పరిశీలించారు. ప్రభుత్వ సహకారంతో పేదల సొంతింటి కల సాకారం కావడం ఆనందదాయకమని పేర్కొన్నారు. రిమ్మ గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి ఇప్పటివరకు 69 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసినట్లు తెలిపారు. ఇంకా అర్హులైన కుటుంబాలకు అదనపు గృహాలు మంజూరు చేసేందుకు చర్యలు చేపడుతున్నామని అన్నారు. గ్రామానికి అవసరమైన బీటీ రహదారి నిర్మాణానికి కూడా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

**విద్యాభివృద్ధికి ప్రాధాన్యం..**

గ్రామంలో గ్రంథాలయ నిర్మాణం కోసం రూ.10లక్షల ఆర్థిక సాయాన్ని మంత్రి ప్రకటించారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులు తమ పిల్ల ల చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి కొత్త రేషన్ కార్డులు, సామాజిక భద్రతా పెన్షన్లు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి వివక్షకు తావులేదని స్పష్టం చేశారు.

**మారుమూల గ్రామాల అభివృద్ధికి పెద్దపీట**

మారుమూల గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. రిమ్మ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ద్వారా పేదల సొంతింటి కలను నెరవేర్చుతున్నామని తెలిపారు. రోడ్లు, విద్యుత్, తాగునీరు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకం చివరి లబ్ధిదారుడికి చేరేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కొనసాగుతోందని చెప్పారు. గ్రామాభివృద్ధికి ప్రజలందరూ సమష్టిగా సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ అఖిల్ మహాజన్, సర్పంచ్ పెందూర్ జంగుబాయి, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధిలో అందరు భాగస్వాములు కావాలి

- సర్పంచ్ నీలిమ రవీందర్ రెడ్డి
- అయ్యప్ప గ్రామ సంఘం భవన నిర్మాణానికి భూమిపూజ

**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** గ్రామ సంఘం భవనం నిర్మాణం ద్వారా మహిళా సంఘాల కార్యకలాపాలు మరింత బలోపేతం అవుతాయని, గ్రామాభివృద్ధికి ప్రజలందరూ సమష్టిగా కృషి చేసి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని గ్రామ సర్పంచ్ ఏలేటి నీలిమ రవీందర్ రెడ్డి పిలుపునిచ్చారు. నేరడిగొండ గ్రామంలో నూతనంగా నిర్మించనున్న అయ్యప్ప గ్రామ సంఘం భవన నిర్మాణానికి శనివారం భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భవిత మండల సమాఖ్య అధ్యక్షురాలు బండి మౌనిక సాయితేజ, సాయిబాబా వీఓ అధ్యక్షులు రజిత, గంగామణి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సంఘాల సభ్యులు భవన నిర్మాణ పనులు విజయవంతంగా పూర్తికావాలని ఆకాంక్షిస్తూ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, మాజీ జెడ్పీటీసీ పండరి మాట్లాడుతూ భవన నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేసి గ్రామ సంఘాల అవసరాలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నేరడిగొండ సీసీ లింగరాజు, వీఓఏలు గంగాధర్, శ్రీలత, వీఓఓబీలు



ప్రవళిక, కృష్ణవేణి, పుష్పలత, లక్ష్మి, మూడు గ్రామ సంఘాల సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# తెలంగాణ పల్లె ల అభివృద్ధికి కాంగ్రెస్ నిర్మించిన పునాది

- ఉపాధి హామీ పథకంతో గ్రామీణ విప్ల వం సాధ్యం

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** గ్రామీణ ప్రాంతాల ఆర్థిక పురోగతి, పేదరిక నిర్మూలనకు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్) నిజమైన వెన్నుముకగా నిలిచిందని ఆదిలాబాద్ యువజన కాంగ్రెస్ జిల్లా సోషల్ మీడియా అధ్యక్షుడు (కోఆర్డినేటర్) శ్రీకర్ గౌడ్ పేర్కొన్నారు. ఈ చారిత్రాత్మక చట్టాన్ని తీసుకువచ్చి దేశ వ్యాప్తంగా కోట్లాది మంది కూలీల జీవితాల్లో వెలుగులు నింపిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని అన్నారు.శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ 2005లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం పనిచేసే హక్కును చట్టబద్ధం చేస్తూ ఉపాధిహామీ పథకాన్ని అమల్లోకి తీసుకువచ్చిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి లేక నగరాలకు వలస వెళ్లే పేద



కుటుంబాలకు గ్రామాల్లోనే వంద రోజుల ఉపాధి కల్పించి ఆర్థిక భరోసా కల్పించిందని తెలిపారు. కూలీల బ్యాంక్ ఖాతాల్లోకి నేరుగా వేతనాలు జమ చేయడం, మహిళలకు సమాన వేతనం కల్పించడం ద్వారా వారి ఆర్థిక సాధికారతకు ఈ పథకం దోహదపడిందన్నారు. కేవలం ఉపాధి కల్పనకే కాకుండా గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధికి కూడా ఈ పథకం కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు. పొలాల్లో కల్వర్టుల నిర్మాణం, చెరువుల పునరుద్ధరణ, కాలువల పూడికతీత, అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణం, వైకుంఠధామాలు, కంపోస్ట్ షెడ్ల ఏర్పాటు వంటి పనులు ఉపాధిహామీ పథకం ద్వారానే చేపట్టబడ్డాయని వివరించారు. అలాగే హరితహారంలో భాగంగా మొక్కల సంరక్షణ, నర్సరీల నిర్వహణ వంటి కార్యక్రమాలకు కూడా ఈ పథకం ఉపయోగపడిందన్నారు. ఉపాధి హామీ పథకం ఒక నిరంతర చట్టబద్ధమైన ప్రక్రియ అని, ప్రతి సంవత్సరం బడ్జెట్ కేటాయింపులు చేసి నిధులను గ్రామాలకు అందించడం ప్రభుత్వాల కనీస బాధ్యత అని గుర్తు చేశారు. తెలంగాణ పల్లె ల్లోజరిగిన అభివృద్ధి వెనుక స్థానిక ప్రజాప్రతినిధులు, కూలీల కృషి ఉందని పేర్కొన్నారు. గ్రామీణాభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ వేసిన బలమైన పునాదులను ప్రజలు గుర్తించాలని కోరారు.

# ఘనంగా మంత్రి జూపల్లి కృష్ణారావు పర్యటన

- రూ.15.39 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సంస్కృతి శాఖ మంత్రి, ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పర్యటన శనివారం ముగిసింది. రెండు రోజుల పర్యటనలో భాగంగా నిర్మల్, ఆదిలాబాద్ జిల్లా ల్లో రూ.15.39 కోట్ల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ప్రారంభించడంతో పాటు శంకుస్థాపనలు చేశారు. నిర్మల్ జిల్లా లో ఎల్వి ప్రసాద్ కంటి ఆసుపత్రి కేంద్రాన్ని, సిరికొండ మండలం రిమ్మ గ్రామంలో నిర్మించిన ఇందిరమ్మ ఇండ్ల ను ప్రారంభించి లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాజీ పీసీసీ అధ్యక్షుడు దివంగత పి.నర్సారెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఆదిలాబాద్ జిల్లా లోరూ.1.43 కోట్ల వ్యయంతో నిర్మించిన మావల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని ప్రారంభించారు. అలాగే సెంట్రల్ లైబ్రరీ మొదటి అంతస్తును ప్రారంభించి, బజార్ హత్నూర్ లైబ్రరీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గాయత్రి ఫంక్షన్ హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో అర్హులైన లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి , షాదీ ముబారక్ చెక్కులు, కుట్టు మిషన్లు , మోటరైజ్డ్ వాహనాలను పంపిణీ చేశారు. అదేవిధంగా బేల-గూడ హైలెవెల్ బ్రిడ్జితో పాటు పలు రహదారి అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, సిరికొండ సర్పంచ్ బొడ్డు దత్తాత్రేయ,



డీసీసీ జనరల్ సెక్రటరీ షేక్ ఇమామ్, ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మంత్రి జూపల్లి ని కలిసిన మాధాపూర్ సర్పంచ్ ఇమ్రాన్ షాదుల్లా

### గ్రామాభివృద్ధి పనులకు నిధుల మంజూరుపై వినతి



**ఉద్యమ కెరటం, ఇచ్చోడ:** ఇచ్చోడ మండలం మాధాపూర్ గ్రామపంచాయతీ సర్పంచ్ షేక్ ఇమ్రాన్ షాదుల్లా ఆదిలాబాద్ జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర ఎక్సైజ్, ప్రొహిబిషన్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధికి సంబంధించిన పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రం సమర్పించారు. గ్రామంలో సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్ల నిర్మాణం చేపట్టడంతో పాటు కొత్త గ్రామపంచాయతీ భవనం, హెల్త్ సబ్ సెంటర్ భవనాలను మంజూరు చేయాలని కోరారు. అదేవిధంగా గ్రామంలోని అర్హులైన పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. సర్పంచ్ వినతిపై మంత్రి జూపల్లి కృష్ణారావు సానుకూలంగా స్పందించారు. మాధాపూర్ గ్రామ సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. గ్రామ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుపై చర్చించినట్లు సర్పంచ్ షేక్ ఇమ్రాన్ షాదుల్లా తెలిపారు.

# కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలి

- కాంగ్రెస్ ముఖ్య నాయకులను కలిసిన సిరికొండ మండల నేతలు



**ఉద్యమ కెరటం, ఇచ్చోడ:** పార్టీ కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆడే గజేందర్ అన్నారు. ఇచ్చోడ మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన బూత్ లెవెల్ ఏజెంట్స్ (బీఎల్ఏ–2) సమావేశం సందర్భంగా సిరికొండ మండల నాయకులు ఆడే గజేందర్తో పాటు టీపీసీసీ కో–ఆర్డినేటర్ రాథోడ్ నరేష్ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సహచర కో–ఆర్డినేటర్లు రాఘవేంద్ర రెడ్డి, మోహన్ కుమార్లను కూడా కలిసి శాలువాలతో సత్కరించారు. అనంతరం నియోజకవర్గంలో పార్టీ బలోపేతం, బూత్ స్థాయి కమిటీల పనితీరు, రాబోయే పార్టీ కార్యక్రమాలు, కార్యకర్తల సమన్వయంపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసి విజయపథంలో నడిపించేందుకు ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిరికొండ మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పాకలగూడెం శివారులో ఘోర రోడ్డు ప్రమాదం

### ఇద్ద రు యువకులకు తీవ్ర గాయాలు

**ఉద్యమ కెరటం, సత్తుపల్లి :** సత్తుపల్లి మండలం పాకలగూడెం శివారులో శనివారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. సెంట్రింగ్ కర్రల లోడ్తో వెళ్తున్న వాహనం నుంచి ఒక్కసారిగా దట్టమైన పొగ వ్యాపించడంతో ఎదురుగా వస్తున్న వాహనదారులకు రహదారి సరిగా కనిపించక ప్రమాదం సంభవించినట్లు సమాచారం. ఈ క్రమంలో కారు బైక్ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఖమ్మంలోని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు. స్థానికుల కథనం ప్రకారం.. సెంట్రింగ్ కర్రల లోడ్తో వెళ్తున్న వాహనం నుంచి వ్యాపించిన దట్టమైన పొగ కారణంగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ కొనసాగిస్తున్నారు.

# లారీ ఢీకొని యువ రైతు మృతి



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** లారీ అజాగ్రత్తగా రివర్స్లో రావడంతో బైక్పై వెళ్తున్న యువ రైతు మృతి చెందిన విషాద ఘటన నేరడిగొండ మండలంలోని రోల్మామడ గ్రామ సమీపంలో జాతీయ రహదారి–44పై శనివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని యాపలగూడ గ్రామానికి చెందిన మండాడి భీంరావ్ (30) ఉదయం తన బైక్ (టీఎస్ 01 ఈఎన్ 7055)పై గుత్పాల గ్రామానికి వెళ్లి బంధువులను పరామర్శించి తిరిగి ఇంటికి బయల్దేరాడు. మార్గమధ్యలో దేవుల్ నాయక్ తండా సమీపానికి చేరుకోగానే లారీ (ఎంహెచ్ 40 బీజీ 6579) డ్రైవర్ వాహనాన్ని రాంగ్రూట్లో అజాగ్రత్తగా రివర్స్ తీస్తుండగా వెనుక నుంచి వస్తున్న భీంరావ్ బైక్ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన భీంరావ్ను స్థానికులు 108 అంబులెన్స్ ద్వారా నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు నిర్ధా రించారు. మృతుడి సోదరుడు కృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దేవుల్ నాయక్ తండాకు చెందిన లారీ డ్రైవర్ పోలియాడే జగన్పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

# నేడు ఉచిత న్యూరాలజీ వైద్య శిబిరం

**ఉద్యమ కెరటం, తాండూర్:** తాండూర్ మండలం అచలాపూర్ గ్రామంలో ఆదివారం శ్రీ మహా వేద పాఠశాల కళ్యాణ మండపంలో ఉచిత న్యూరాలజీ వైద్య శిబిరం నిర్వహించడం జరుగుతుందని శ్రీ మహా వేద పాఠశాల నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వైద్య శిబిరం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ వైద్య శిబిరంలో న్యూరో నిపుణులు డాక్టర్ అభినయ్ కుమార్ గట్టు ఆధ్వర్యంలో వైద్యులు బీపీ, షుగర్ పరీక్షలతో పాటు నరాల సంబంధిత సమస్యల పరిశీలన, అనుభవజ్ఞులైన వైద్యులచే ఉచిత వైద్య సలహాలు ఇస్తారని, రోగులను పరీక్షిస్తారని తెలిపారు. ప్రజలు ఈ ఉచిత న్యూరాలజీ వైద్య శిబిరాన్ని చేసుకోవాలని కోరారు.

# ఆసుపత్రిలో ఫ్యాన్లు లేక రోగుల అవస్థలు



**ఉద్యమ కెరటం, జైనూర్:** జైనూర్ మండలం ఉషెగాం ప్రభుత్వ ఆసుపత్రిలో ఫ్యాన్లు లేకపోవడంతో రోగులు, వారి సహాయకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేసవి వేడి తీవ్రంగా ఉండటంతో ఆసుపత్రికి వచ్చే ప్రజలు ఉక్కపోతతో అవస్థలు పడుతున్నారు. ఆసుపత్రిలోని వార్డులు, వేచి ఉండే గదుల్లో ఫ్యాన్లు లేకపోవడం, ఉన్నవి పని చేయకపోవడంతో రోగులు అసౌకర్యానికి గురవుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు, గర్భిణీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు తెలిపారు. వైద్యం కోసం ఆసుపత్రికి వచ్చిన వారు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తుండగా, కనీస సౌకర్యాలు లేకపోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఆసుపత్రిలో అవసరమైన ఫ్యాన్లు ఏర్పాటు చేయడంతో పాటు మెరుగైన వసతులు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

# పాఠశాలల్లో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** ప్రభుత్వ పాఠశాలల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. శనివారం లక్షెట్టిపేట మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా భోజనశాల, అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేస్తూ విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీరు, విద్యుత్, ప్రహరీ గోడలు, మరుగుదొడ్లు తదితర మౌలిక సదుపాయాలను కల్పిస్తూ విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం సృష్టిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు బ్రేక్ఫాస్ట్, మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం అందిస్తున్నామని చెప్పారు. విద్యా సంవత్సరం ప్రారంభం రోజునే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పాఠశాలల్లో కొనసాగుతున్న నిర్మాణ పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, విద్యా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయంలో విత్తన గుళికల ప్రాధాన్యంపై అవగాహన కార్యక్రమం

**ఉద్యమ కెరటం, లింగాల :**

లింగాల మండలంలోని ఎగువపల్లి గ్రామంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యంలో రైతులకు విత్తన గుళికల తయారీ విధానం, వాటి ఉపయోగాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల సమక్షంలో విత్తన గుళికలను తయారు చేసి ప్రదర్శించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వివరాల ప్రకారం, విత్తన గుళికల తయారీకి బీజామృతం, బంకమట్టి పొడి, ఘన జీవామృతం పొడి, బూడిద వంటి పదార్థాలను ఉపయోగిస్తారు. ముందుగా విత్తనాలను గోనె సంచిలో తీసుకుని, వాటికి మూడు నుంచి ఐదు రెట్లు పరిమాణంలో ఈ పదార్థాలను కలిపి గుళికలుగా తయారు చేస్తారని తెలిపారు. విత్తన గుళికల వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ, విత్తనాలు భూమిలో ఆరు నెలల వరకు సురక్షితంగా నిల్వ ఉండటంతో పాటు ప్రతికూల వాతావరణ పరిస్థితులను తట్టుకునే సామర్థ్యాన్ని పొందుతాయని చెప్పారు. సాధారణ విత్తనాల మొలకెత్తడానికి 22 నుంచి 25 మిల్లీమీటర్ల వర్షపాతం అవసరమవుతుందని, అయితే విత్తన గుళికల విధానంలో కేవలం 10 నుంచి 15 మిల్లీమీటర్ల తేమ ఉన్నా మొలకెత్తే అవకాశాలు మెరుగుపడతాయని వివరించారు. అలాగే నేల, గాలి, విత్తనం ద్వారా సంక్రమించే తెగుళ్లను తట్టుకునే శక్తి పెరగడంతో పాటు, పంటలను దెబ్బతీసే పురుగులను ఎదుర్కొనే సామర్థ్యం కూడా విత్తన గుళికలకు ఉంటుందని తెలిపారు. రైతులకు ప్రత్యక్షంగా గుళికల తయారీ విధానాన్ని చూపించి, వాటి ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు.

# పెండింగ్ బిల్లుల కోసం 'గన్ పార్క్' నుండి శాంతియుత ర్యాలీకి పిలుపు

### చిన్న పత్రికల సంపాదకులు



**ఉద్యమ కెరటం, హైదరాబాద్ :**

గత రెండేళ్లుగా ప్రభుత్వ ప్రకటనల (యాడ్స్) బిల్లులు చెల్లించకుండా పెండింగ్‌లో పెట్టడంపై చిన్న పత్రికల సంపాదకులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై చర్చించేందుకు శనివారం అజంపురాలోని 'డైలీ సూపర్ ఎక్స్‌ప్రెస్' కార్యాలయంలో చిన్న పత్రికల సంపాదకుల ఒక ముఖ్యమైన సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం, సమాచార పౌర సంబంధాల శాఖ (I&PR) ఈ బకాయిల విడుదలలో నిరంతరం ఆలస్యం చేస్తుండటాన్ని ప్రతినిధులు తీవ్రంగా తప్పుపట్టారు. గత రెండేళ్ల కాలంలో ప్రభుత్వం మరియు సంబంధిత అధికారులకు అనేకమార్లు వినతి పత్రాలు సమర్పించినప్పటికీ, సమస్య పరిష్కారంలో ఎలాంటి చెప్పుకోదగ్గ పురోగతి లేకపోవడంపై వక్తలు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. సకాలంలో బిల్లులు రాకపోవడం వల్ల చిన్న పత్రికలు నడపలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అయినప్పటికీ అటు ప్రభుత్వం కానీ, ఇటు సమాచార శాఖ కానీ ఈ విషయాన్ని పరిష్కరించడంలో తగిన ఆసక్తి చూపడం లేదని వారు పేర్కొన్నారు. ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించిన అనంతరం, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న తమ బిల్లులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఒక ఏకగ్రీవ తీర్మానం చేశారు. రాష్ట్ర అసెంబ్లీ ఎదురుగా ఉన్న గన్ పార్క్ (అమరవీరుల స్థూపం) నుండి సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయం వరకు శాంతియుత మార్చ్ (ర్యాలీ) నిర్వహించాలని నిర్ణయించారు. ఈ పోరాటానికి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న చిన్న పత్రికల సంపాదకులు, నిర్వాహకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మద్దతు ప్రకటించాలని, ఈ మార్చ్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ పోరాటంలో భాగంగా, రాబోయే సోమవారం నాడు వివిధ జర్నలిస్టు సంఘాల ముఖ్య నాయకులను, కార్యవర్గాన్ని కలిసి సమస్యను వివరించాలని, వారి పూర్తి సహకారాన్ని కోరాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ ప్రతిపాదిత శాంతియుత ర్యాలీ తేదీ , ఇతర వివరాలను త్వరలోనే అధికారికంగా ప్రకటిస్తామని సంపాదకులు తెలిపారు. ఈ సమావేశంలో చిన్న పత్రికల సంపాదకులు సయ్యద్ ఉస్మాన్ రషీద్ (మెహంగై), మహమ్మద్ వాజిద్ మసూద్ (సియానత్-ఎ-జమ్హూర్), ఎస్.ఎస్.కె. హుస్సేనీ ఇక్బాల్ (దెక్కన్ సమాచార్), సయ్యద్ అబ్దుల్ సమద్ (సూపర్ ఎక్స్‌ప్రెస్), మహమ్మద్ ఖలీల్ అహ్మద్ (తులు-ఎ-సెహర్), మహమ్మద్ యూసుఫుద్దీన్ ఖాద్రీ (ఇన్ఫార్మర్స్), మీర్ ఫయాజ్ అలీ (దెక్కన్ కీ ఆవాజ్), మీర్ కర్రార్ అలీ ఖాన్ అబిది (రహ్నుమా-ఎ-హింద్), సయ్యద్ మహమ్మద్ హుసైనీ (పర్వాజ్-ఎ-హింద్), మహమ్మద్ సిబ్గతుల్లా అసద్ (షమ్స్ టైమ్స్), సయ్యద్ ముస్తఫా ఖాద్రీ ఇమ్రాన్ (వకార్-ఎ-దెక్కన్), అతీక్ అక్బర్ (కౌమీ ఇంతెఖాబ్), సయ్యద్ కాజిమ్ హుస్సేన్ (షాకార్), మహమ్మద్ అబ్దుల్ గఫూర్ (యూత్ వరల్డ్), రియాసత్ అలీ (స్పిరిట్ ఆఫ్ వరల్డ్), అఫ్రోజ్ ఖురేషి (ప్రగతి టైమ్స్), సయ్యద్ అస్లాం (వాయిస్ ఆఫ్ హైదరాబాద్), మహమ్మద్ కలీమ్ (ఆయినా హైదరాబాద్), మహమ్మద్ ఇలియాస్ (దెక్కన్ లైట్స్), మరియు కె. యువరాజ్ (వన్ నేషన్) తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్నాం
- రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు





**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్ :** "ప్రగతి పథం.. సకలజన హితం.. మన ప్రజా ప్రభుత్వం" అనే నినాదంతో రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను సామాన్య ప్రజల ముంగిటకే తీసుకువస్తోందని జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శనివారం స్థానిక గాయత్రి గార్డెన్స్లో నిర్వహించిన '99 రోజుల ప్రజాపాలన– ప్రగతి ప్రణాళిక' కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, అర్హులైన లబ్ధిదారుల గుర్తింపు, క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుతున్న సేవలపై వివరించారు. సమాజంలోని ప్రతి అర్హుడైన పేద కుటుంబానికి సంక్షేమ ఫలాలు చేరేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. సంక్షేమ పథకాల పారదర్శక అమలుతోనే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. అనంతరం ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన మెగా జాబ్ మేళాలో ఉద్యోగాలు సాధించిన యువతీ యువకులను సన్మానించి టాస్క్ సర్టిఫికెట్లు అందజేశారు. పంచాయతీ కార్యదర్శులకు మ్యారేజ్ రిజిస్ట్రర్లను పంపిణీ చేశారు. అలాగే అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు, కళ్యాణలక్ష్మి , షాదీ ముబారక్ పథకాల కింద ఆర్థిక సహాయ చెక్కులు అందజేశారు. మైనార్టీ లబ్ధి దారులకు కుట్టు మిషన్లు, అగ్నిమాపక శాఖకు ఎస్డీఆర్ఎఫ్ ఉపకరణాలను పంపిణీ చేశారు. వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసి శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ ఎంపీ జి.నగేష్, జిల్లా కలెక్టర్ రాజర్షిషా, అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, వెడ్మ బొజ్జు పటేల్, మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనుషా, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై మంత్రి జూపల్లి సమరశంఖం

- ప్రజా వ్యతిరేక విధానాలే అజెండా
- రాష్ట్ర ప్రగతిపై ఎక్కడైనా చర్చకు సిద్ధం



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో పాటు రాష్ట్రంలో బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో జరిగిన వైఫల్యాలపై కాంగ్రెస్ పార్టీ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తోందని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే మూడు నెలల పాటు నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీలు, నిరుద్యోగం, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, ఓటర్ల జాబితా నుంచి పేర్ల తొలగింపు (ఎస్ఐఆర్) వంటి అంశాలపై దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగ పరిరక్షణే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ పోరాడుతోందని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి , గృహజ్యోతి తదితర ఆరు గ్యారెంటీలను విజయవంతంగా అమలు చేస్తోందని, రైతు రుణమాఫీ కార్యక్రమాన్ని చిత్తశుద్ధితో పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. టీఎస్పీఎస్సీని ప్రక్షాళన చేసి పారదర్శకంగా ఉద్యోగాల భర్తీ చేపడుతున్నామని, 'భారత్ ఫ్యూచర్ సిటీ' ద్వారా పెట్టుబడులు, ఉపాధి అవకాశాలకు కొత్త ద్వారాలు తెరుస్తున్నామని చెప్పారు.

**ఉమ్మడి ఆదిలాబాద్ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక..**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి తెలిపారు. తుమ్మిడిహట్టి బ్యారేజ్ నిర్మాణం ద్వారా సాగునీటి సమస్యలకు పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఐటీడీఏ ద్వారా మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు కుంటాల, పొచ్చెర జలపాతాలు, కవ్వాల్ టైగర్ రిజర్వ్ను అంతర్జాతీయ పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేస్తామని వివరించారు. బీ జేపీ, బీఆర్ఎస్ పార్టీల మధ్య ఉన్న "చీకటి ఒప్పందాన్ని" ప్రజలు గమనిస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రగతిపై ఏ వేదిక పైనైనా చర్చకు కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందని సవాల్ విసిరారు.

# కార్మిక సంక్షేమంలో రాజీపడేది లేదు

- సింగరేణి తెలంగాణ ప్రజల ఆస్తి
- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క





**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** సింగరేణి కార్మికుల సంక్షేమంలో ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడదని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళికా శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. సింగరేణి సంస్థ తెలంగాణ ప్రజల ఆస్తి అని, ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రభుత్వం అప్రమత్తంగా ఉంటుందని తెలిపారు. శనివారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని పద్మనాయక ఫంక్షన్ హాల్లో వైద్యపరంగా పనిచేయలేని సింగరేణి ఉద్యోగుల కుటుంబ సభ్యులకు నియామక పత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పొన్నం ప్రభాకర్, ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్సీ దండే విఠల్, ఎమ్మెల్యేలు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, గడ్డం వినోద్, గండ్ర సత్యనారాయణ, మలోత్ రాందాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ వైద్యపరంగా విధులు నిర్వహించలేని సింగరేణి ఉద్యోగుల కుటుంబాలకు చెందిన 335 మంది అర్హులకు నియామక పత్రాలు అందజేయడం సంతోషకరమన్నారు. భవిష్యత్తులో మరింత మంది అర్హులకు అవకాశం కల్పించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సింగరేణి కార్మికులకు రూ.1.25 కోట్ల బీమా సౌకర్యం కల్పిస్తున్నామని, 30వేల మంది ఒప్పంద, పొరుగు సేవల సిబ్బందికి బోనస్ అందించామని పేర్కొన్నారు. తెలంగాణ సహజ వనరులను పరిరక్షిస్తూ సింగరేణి సంస్థను మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ తెలంగాణ నల్లబంగారం అయిన బొగ్గు సంపదను, సింగరేణి సంస్థను కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ మెడికల్ అన్ఫిట్ నియామకాల విషయంలో పారదర్శకంగా వ్యవహరిస్తున్నామని తెలిపారు. మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు మాట్లాడుతూ నియామక పత్రాలు అందుకున్న 335 మందిలో 117 మంది మంచిర్యాల జిల్లాకు చెందిన వారే కావడం ఆనందంగా ఉందన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే మాట్లాడుతూ 1992లో సింగరేణి సంస్థను రూ.450 కోట్లకు బిఐఎఫ్ ఆర్ కింద పంపించడాన్ని ఆనాడు గడ్డం వెంకటస్వామి అడ్డుకొని కాపాడారని గుర్తు చేశారు. కార్మికులకు సింగరేణి లాభాలలో వాటా ఇప్పించడం జరిగిందని తెలిపారు. అనంతరం అర్హులైన సింగరేణి కార్మిక కుటుంబ సభ్యులకు నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సింగరేణి అధికారులు, కార్మిక సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్మికులు పాల్గొన్నారు.



